విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 28, ఏప్రిల్ 2023

విధ్వంసక, మతోన్మాద పాలన అందించిన ఘనత మోడీకే దక్కింది

▶ సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు

విశాలాంధ్ర - నంద్యాల : కేంద్రంలో ఢిల్లీని పాలించే అర్హత బీజేపీ కి లేదని, దేశంలో విధ్వంసక, మతోన్మాద పాలనను అందించిన ఘనత ప్రధాని నరేంద్ర మోడీకే దక్కిందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు ఆరోపించారు. సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో గత కొన్ని రోజులుగా జరుగుతున్న ప్రజాయాత్ర ముగింపు సభ నంద్యాల జిల్లా కేంద్రంలోని పద్మావతినగర్‌లో గురువారం జరిగింది. నంద్యాల పట్టణ సీపీఐ కార్యదర్శి ప్రసాద్, సీపీఎం కార్యదర్శి పుల్లా నర్సింహులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు రామాంజనేయులు, సీపీఎం రాష్ట్ర కార్యవర్గసభ్యులు ప్రభాకర్ రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబా ఫకృద్దిన్ తదిత రులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఏప్రిల్ 14వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా 24జిల్లాల్లో సీపీఐ, సీపీఎం ఉమ్మడిగా బీజేపీ సాగిస్తున్న దుర్మార్గపు పాలనను తిప్పి కొట్టాలని ప్రజలకు పిలుపునివ్వడం జరిగిందన్నారు. రాబోయే 2024ఎన్నికల్లో బిజెపిని ఓడించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దేశవ్యాప్తంగా సీపీఐ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీజేపీ కనికట్టు రాజకీయాన్ని, దుర్మార్గాన్ని ప్రజలకు వివరించామన్నారు. దేశం వెలిగిపోతుందని చెప్పిన పెద్దమనిషి ఎక్కడ వెలిగిపోయిందో చూపించాలన్నారు. ప్రపంచ దేశాలు మన వైపు చూస్తున్నాయని డబప్పాలు కొడుతున్న మోడీ మన రూపాయి మారకం విలువ ఎందుకు తగ్గిందో వివరించాలని, రూపాయి ఎందుకు పడిపోయిందో ప్రధాని మోడీ, ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 2014ఎన్నికల్లో బిజెపి అధికారంలోకి వస్తే సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్నారని, ఇప్పటికి ఎనిమిది సంవత్సరాలు గడిచాయని ఎన్ని కోట్ల ఉద్యోగాలు ఇచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మోడీ పార్లమెంట్ లో తెచ్చిన నల్ల చట్టాలను సంవత్సరం పాటు రైతులు ధర్నా చేయగా, రైతులకు క్షమాపణలు చెప్పి, నల్లచట్టాలను ఉపసంహరించుకున్న మోడీకి ప్రధాని కుర్చీలో కూర్చునే అర్హత లేదన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని సాధించుకున్న విశాఖ ఉక్కును కార్పొరేట్లకు అమ్ముకుం టున్నారని, 700 రోజులుగా కార్మికులు దీక్షలు చేస్తున్నా కూడా పట్టించుకోకుండా విశాఖ ఉక్కును అమ్మేస్తున్నారని ఆరోపించారు. దేశాన్ని గుంపగుత్తగా అదాని, అంబానీలకు కట్టబెడుతున్నారని ముప్పాళ్ళ ఆరోపించారు. ఇకపోతే రాష్ట్రంలో జగన్ పాలన అస్తవ్యస్తంగా ఉందని, దళితులపై దాడులు ఆగడం లేదని, ఎమ్మెల్సీ అనంతబాబు దళిత డ్రైవర్ను చంపి అతని కారులోనే తీసుకువచ్చి రెండు లక్షలు ఇస్తానం టూ కుటుంబ సభ్యులతోనే బేరమాడారన్నారు. ఆయన విడుదల అవుతుంటే ఊరేగింపు నిర్వహించారని పేర్కొన్నారు. అమరావతి రాజధానిని అభివృద్ధి చేయకుండా ఇష్టం వచ్చినట్లు ధ్వంసం చేశారని, 34,000 ఎకరాలను అమరా వతి ప్రాంత రైతులు ఇవ్వగా పట్టించుకోకుండా కేవలం బటన్ నొక్కుతూ కాలయాపన చేశాడని ఆయన దుయ్యబట్టారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వాన్ని, రాష్ట్రంలో జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించేవరకు కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు విశ్రమించవని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీపీఐ, సీపీఎం నాయకులు సోమన్న, సుబ్బారాయుడు, శ్రీనివాసులు, దనుంజయుడు, నాగరాముడులతో పాటు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి శివన్న ఆధ్వర్యంలో పాడిన గేయాలు అలరించాయి.

ప్రజల మన్నలు పొందిన నాయకుడు

విశాలాంధ్ర - నందికొట్కూరు : ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్ర నాయకులు గ ప్రజల మన్నలు పొందిన నాయకుడు ఏపీ షాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి అని ఆయన గురించి తెలుసుకోకుండా తెలుగుదేశం పార్టీ వారు నోరు పారేసు కుంటే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించిన ఉమ్మడి జిల్లాల మైనార్టీ సెల్ జోనల్ ఇన్చార్జి అబూబకర్ అన్నారు. గురు వారం పట్టణంలోని స్థానిక వైఎస్ఆర్సిపి నాయకుని స్వగృ హంలో కౌన్సిలర్లతో కలసి విలేకరుల సమావేశం నిర్వహిం చారు. ఆయన మాట్లాడుతూ అల్లూరు గ్రామంలో టీడీపీ నాయకులు మాండ్ర శివానందరెడ్డి స్వగృహంలో పలువురు టీడీపీ నాయకులు విలేకరుల సమావేశంలో బైరెడ్డి సిద్ధార్థరెడ్డి పై చేసిన వాక్యాలను ఖండిస్తున్నా మన్నారు. మా నాయకుని బచ్చా అన్నవాడు టిడిపి మోమిన్ ముస్తఫా అర్హత తెలుసుకోకుండా మాట్లాడితే తగిన మూల్యం తప్పదని హెచ్చరించారు. నియోజవర్గ అభివృద్ధి కోసం శ్రమిస్తున్న ఏకైక నాయకుడు షాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి అన్నారు. వైయస్సార్ బిక్ష తో రాజకీయ పదవులు అనుభవిస్తూ వైయస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబానికి వెన్నుపోటు పొడిచి ఊసరవెల్లి రాజకీయాలు నడుపుతున్న చరిత్ర మీ నియోజకవర్గ టిడిపి నాయకులదన విషయాన్ని గుర్తుంచుకోవాలనారు. గత టిడిపి పాలనలో తమ స్వార్థం తన బావ రాజకీయ ఉనికి కోసం కౌన్సిలర్లను అమ్మివేసిన చరిత్ర గౌరు కుటుంబానికి దక్కిందన్నారు.గత ఎన్నికలలో సింగిల్ గా టిడిపి నాయ కుల పై నియోజవర్గంలో ఒక ఎమ్మెల్యే సీటును నిలబెట్టి గెలిపించుకున్న చరిత్ర బైరెడ్డి సిద్ధార్థ రెడ్డిది అన్నారు. నమ్ము కున్న పార్టీ కోసం, నమ్మిన కార్యకర్తల కోసం నియోజకవర్గ అభివృద్ధి కోసం శ్రమిస్తున్న నాయకుడు సిద్ధార్థ రెడ్డి ఏమిటో అన్న విషయాన్ని ప్రజల్ని ఎవర్ని అడిగిన చెబుతారన్నారు. చరిత్ర తెలుసుకొని మాట్లాడకపోతే నీ ఆత్మకూరుకు వచ్చి తగిన బుద్ధి చెపుతామని టీడీపీ నాయకులు మోమిన్ ముస్తఫా కు హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ కోఆప్షన్ సభ్యులు జబ్బర్, కిరాణం మర్చంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మన్సూర్, కౌన్సిలర్లు నాయబ్, రావు ఫ్, ఉస్మాన్ బేగ్, షేక్షావలి, బి ఎస్ ఆర్ టీం పాల్గొన్నారు.

సెలవులు ఇవ్వాలి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున మే నెల అంతా సెలవులు ఇవ్వాలని, అలాగే మే నెల గౌరవ వేతనం ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సుంకయ్య అన్నారు. కరెంటు బిల్లులు, అంగన్వాడి కేంద్రాల బాడుగలు, వైయస్సార్ సంపూర్ణ పోషన బిల్లులు వెంటనే విడుదల చేసి ఆదుకోవాలని పై సమస్యలను ఉన్నతాధికా రులకు తెలియజేసి మాకు న్యాయం చేయాలని పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఐసిడిఎస్ కార్యాలయంలో సమర్పించారు. వసుంధర, చంద్రకళ, తిరుపాలమ్మ, పద్మ, ఇందు పాల్గొన్నారు.

త్వరలో నూతన గ్రంథాలయం ఏర్పాటు

విశాలాంధ్ర - నందికొట్కూరు : నందికొట్కూరు పట్టణం నందు పాఠకులకు త్వరలో నూతన గ్రంథాలయం రూ 40 లక్షలతో కొత్త భవనం నిర్మించడం జరుగుతుందని ఉమ్మడి జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ అన్నారు. గురువారం పట్టణంలోని శాఖ గ్రంథాలయం నందికొట్కూరు నందు గ్రంథాలయ అభివృద్ధి, ప్రజలు భాగస్వామ్యం అనే అంశంపై పాఠకులతో కలసి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో నందికొట్కూరు సబ్ జైల్ సూపర్డెంట్ మల్లయ్య, హై స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్, నందికొట్కూరు లైబ్రరీ కమిటీ చైర్మన్ జయరాం, నందికొట్కూరు శాఖ గ్రంథాలయం అధికారి మురళీధర్, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

రైతు కమిటీలో అన్ని కులాలకు అవకాశం కల్పించాలి

విశాలాంధ్ర - జూపాడు బంగ్లా : మండలంలోని తర్తూరు గ్రామంలో గ్రామ రైతు కమిటీలలో అన్ని కులాలకు సమానం కల్పించాలని కోరుచు తర్తూర్ గ్రామసభ లో జిల్లా జాయింట్ కలెక్టర్ కు గురువారం వినతిపత్రం అందజేశారు .ఈ సందర్భంగా సీపీఐ జిల్లా నాయకులు రమేష్ బాబు మాట్లాడుతూ నందికొట్కూరు నియోజకవర్గంలోని తర్తూరు, కొణిదెల ,నాగటూరు ,చెరుకు చెర్ల తదితర గ్రామాల్లో గత ఎన్నో సంవత్సరాల నుండి గ్రామ కమిటీ పెద్దలుగా ఒకే సామాజిక వర్గానికి చెందిన కొంతమంది వ్యక్తులు రాజకీయ నాయకుల అండదండలతో గ్రామంలో పెత్తనం చెలాయిస్తున్నారని వారు ఆరోపించారు. గ్రామంలో కాటా సవాల్ ,గొర్ల సవాల్ లెక్కలు చూపకుండా దోపిడీ చేస్తున్నారని వారు ఆరోపించారు, వ్యవసాయ పంట పొలాలకు రైతులు వెళ్లేందుకు కంప చెట్లు తొలగించి ఎద్దుల బండ్ల రస్తాలు లేక రైతుల తీవ్ర ఇబ్బందులకు గురవు తున్నారని వారు ఆరోపించారు. గ్రామంలో లేనివారు, భూములు కౌలుకి ఇచ్చుకొని రాజకీయ అండదండతో గ్రామ కమిటీల్లో పెద్దమనుషులుగా చలామణి అవుతూ పెత్తనం చేస్తున్నారని వారు ఆరోపించారు.ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎం శ్రీనివాసులు, నందికొట్టుకు తాలూకా సెక్రెటరీ కార్యదర్శులు మహానంది, దినేష్, తదితరులు పాల్గొన్నారు.

గని కార్మికుడికి పరామర్శ

విశాలాంధ్ర - బనగానపల్లి : కొలిమిగుండ్ల మండలం బెలూము గ్రామంలో నివసించే మునగాల పెద్ద పుల్లయ్య మాదిగ అనే వ్యక్తిని అదే గ్రామంలో ఉండే మచ్చ నాగ పాప రాయుడు ఎర్రన్న , నాగర్జున, రమేష్ దారి కాపు కాసి పెద్ద పుల్లయ్య పై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో పెద్ద పుల్లయ్య గాయాల పాలై బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రి నందు వైద్య చికిత్స తీసుకుంటుండగా గాయ పడిన పెద్దపుల్లయ్యను నంద్యాల జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి పి సుంకయ్య పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.బనగానపల్లె మండలం సీపీఐ కార్యదర్శి సుబ్బారెడ్డి, ఏఐటీయూసీ ఆర్గనైజేషన్ సెక్రెటరీ శివ బాలకృష్ణ, గిరిజన సమైక్ జిల్లా అధ్యక్షులు రాముడు, మండల సమితి నాయకులు శివ నాగయ్య, కుళాయి స్వామి, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి శవాలై తేలిన బావ, బామ్మర్దులు

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల పట్టణం ఎస్బిఐ కాలనీ వద్ద ఉన్న చెరువు కట్టలో సరదాగా ఈతకు వెళ్లి శవాలై తేలిన సంఘటన చోటు చేసుకుంది. బావ బామ్మర్దులయిన ఎస్బిఐ కాలనీకి చెందిన మహేష్ టెన్త్ పూర్తి చేయగా, హరి డ్రైవర్ గా పని చేస్తున్నాడు. బుధవారం సాయంత్రం చెరువులోకి సరదాగా ఈతకు వెళ్లారు వీరిద్దరూ. చెరువు లోతు భాగంలోకి వీరిద్దరు వెళ్లడంతో గల్లంత య్యారు. వీరి ఆచూకీ కోసం చెరువులో గాలింపు చర్యలు చేపట్టిన రూరల్ పోలీసులు, ఫైర్ సిబ్బంది గురు వారం వీరి మృతదేహాలు లభించి నట్లు తెలిపారు. ఇద్దరి మృతితో ఎస్బి ఐ కాలనీలో విషాదం నెలకొంది. కేసు నమోదు చేసుకుని మృత దేహా లనుపోస్టుమార్టంనిమిత్తం తరలించారు.

మేడేను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - బనగానపల్లి : 137వ మే డే ను బనగానపల్లి పట్టణంలో ఏఐటీ యూసీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిర్వహించి విజయ వంతం చేయాలని నంద్యాల జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి పి సుంక య్య పిలుపునిచ్చారు. పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో సుంకయ్య మాట్లాడుతూ మే డే కార్యక్రమం లో బనగానపల్లి నియోజకవర్గంలో ఉన్నటు వంటి ఆటో, అంగన్వాడి, ఆశ,మధ్యాహ్న భోజన వర్కర్స్ మరియు అన్ని రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు కదం తొక్కి మేడే జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.బనగానపల్లె ఏఐటియుసి అధ్యక్షులు జి కుల్లాయి స్వామి, ఏఐటీయూసీ నంద్యాల జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ డి శివ బాలకృష్ణ,సీపీఐ మండల కార్యదర్శి సుబ్బారెడ్డి, గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు కాలింగ్ రాముడు,సిపిఐ నాయకులు శివ నాగయ్య, ఏఐటీయూసీ రవి పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ : మే 1న జరిగే 137 వ మేడేను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సుంకయ్య పిలుపునిచ్చారు.గురువారం ఎస్టీయూ కార్యాల యంలో ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి భాస్కర్ అధ్యక్షతన ఆశ,అంగన్వాడి, మిడ్ డే మీల్స్ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సుంకయ్య మాట్లాడుతూ ఎందరో ప్రాణాలు అర్పించి సాధించినట ువంటి కార్మికుల ఫలాలను పోరాట ఫలితంగా అందిపుచ్చుకున్నమన్నారు. కానీ ఇప్పుడు ఉన్నటువంటి బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసే దిశగా కార్మిక చట్టాలన్నింటినీ రద్దుచేసి పెట్టుబడిదారీ వ్యవస్థను పెంచి పోషిస్తున్న దన్నారు. ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేస్తూ నిరంకుశంగా ప్రతిపక్ష పార్టీలను అనగదొక్కే విధంగా చర్యను చేపడుతూ నిరంకుశ పాలన సాగిస్తున్నది కాబట్టి దేశ కార్మిక వర్గం అంతా వచ్చేనెల 1న జరగబోయే మేడే దినాన్ని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు వసుంధర చంద్రకళ, లక్ష్మీదేవి, ఇందు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర - ఉయ్యాలవాడ : మత్తు పదార్థాలు సేవించడం వల్ల జీవితాలు నాశనం అవుతాయని ప్రతి ఒక్కరూ వాటికి దూరంగా ఉండాలని ప్రధానోపాధ్యాయురాలు వెంకట శకుంతల అన్నారు. గురువారం విద్యార్థులు స్థానిక బస్టాండ్ వరకు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. మద్యపానం, ధూమపానం, కోకైన్, గుట్కా, బంగాకు, డ్రగ్స్, తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఒక్కసారి మత్తుకు అలవాటు పడితే జీవితంలో చాలా కోల్పోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్ : మండలంలోని వెంకటాపురం గ్రామంలోని ఉన్నత పాఠశాలలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎపి పేరెంట్స్ కమిటీ జిల్లా అధ్యక్షులు జవహర్ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక వెంకటాపురం గ్రామంలో 10వ తరగతి విద్యార్థు లతో కలిసి మాట్లాడుతూ విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ విద్య కీలకమైనదని, పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన తర్వాత విద్యార్థులకు ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించడానికి దూర ప్రాంతాలకు వెళ్లలేక ఐదు గ్రామాలు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అందు వల్ల చదువుకు మధ్యలోనే స్వస్తి పలుకుతున్నారన్నారు.నిరక్షరాస్యత, బాల్య వివాహాలు ఎక్కువ అయ్యే పరిస్థితులు ఉన్నాయని ఇంటర్మీడియట్ విద్యకు దూరమై వారి బంగారు భవిష్యత్తు కోల్పోతున్నారన్నారు. ఒక వెయ్యి మంది విద్యార్థులు చదువుకోవడానికి అవకాశం ఉందని,అధికారులు స్పందించి పాఠశా లలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేసి విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు.

శిల్పా కుటుంబంతోనే నంద్యాల అభివృద్ధి

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 42 వార్డు బయటిపేటలో కౌన్సిలర్ శిరీష 42వ వార్డు ఇంచార్జ్ కిరణ్ ఆధ్వర్యంలో 96వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి పాల్గొన్నారు. వార్డులోని లబ్ధిదా రులకు సంక్షేమ పథకాలను తెలియజేస్తూ కరపత్రాలను ప్రజలకు అందించారు. శిల్పా కుటుంబంతోనే నంద్యాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే శిల్పా రవికి వార్డు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వారి కుటుంబాలలో సంతోషాన్ని నింపాయని, సిఎం జగన్ పేదల పెన్నిధిగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే విధంగా పరిపాలన అందిస్తున్నారన్నారు. మున్సిపల్ చైర్పర్సన్ మాబునిసా,వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పామ్ షావలి, అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ చిమ్మ నాగన్న, వైఎస్ఆర్సిపి కౌన్సిలర్లు కోఆప్షన్ సభ్యులు వార్డు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాలలో బాలికలదే పైచెయ్యి

విశాలాంధ్ర - నంద్యాల : రాష్ట్ర స్థాయి మార్కులతో రావుస్ విద్యా సంస్థల విద్యార్థులు సత్తా చాటారని చైర్మన్ ఎఎంవి అప్పారావు పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఇంటర్ ఫలితాలలో ఎంపీసీ, బైపీసీ విభాగముల నందు 1000 మార్కులకు 988 మార్కులతో సహా 980పైన 12మంది రాష్ట్రస్థాయి మార్కు లు సాధించారని, మదీనా 988/1000, తహసీన్ 988/1000 పాటు 986, 985,985, 985, 983,981,980 సాధించినట్లు తెలిపారు.బైపిసి విభాగంలో ఎస్ లిఖిత 982/1000, దివ్య మంజుల 979/1000 మార్కులు సాధించారని, సిఇసి విభాగంలో 948, 939, 936, 929,903,903 మార్కులు, ఎంఇసి నందు 920, 900 మార్కులు సాధించి నంద్యాల జిల్లాలో రావుస్ విజయ పరంపరను కొనసాగించారని తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో 900 మార్కులు పైన 195మందితో అత్యధిక మంది సాధించారని తెలిపారు.జూనియర్ ఇంటర్ లోఎంపీసీ, బైపీసీ విభాగాలలో రాష్ట్ర స్థాయి మార్కులతో అద్భుత ఫలితాలు సాధించారని అప్పారావు తెలిపారు. జేఈఈ, నీట్ అధ్యాపకులు కళాశాల ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.



అవుకు : పట్టణంలోనే ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించిందని కళాశాల ప్రిన్సిపల్ కే బాబు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విడుదల చేసిన ఇంటర్ పరీక్ష ఫలితాలలో 50శాతం ఫలితాలు సాధించి జిల్లాలో అవుకు కళా శాల మూడో స్థానంలో నిలిచిందని అన్నారు. సీనియర్ బైపీసీ విద్యార్థి సుష్మిత 868 మార్కులు, సీనియర్ ఎంపీసీ విద్యార్థి రాజేశ్వరి 858 మార్కులు, జూని యర్ బైపిసి విద్యార్థి అజిత 417 మార్కులు సాధించారని అన్నారు.

వెలుగోడు : వెలుగోడు పట్టణంలో జూనియర్ కళాశాల , ఏ.పి.మోడల్ స్కూల్ , కస్తూరీ భా పాఠశాల యందు ఇంటర్ ఫలితాల్లో బాలికల దే హవా కొన సాగింది. ఏ.పి.మోడల్ స్కూల్ లో సెకండ్ ఇయర్‌లో 62మంది పరీక్షలు వ్రాయగా 46మంది ఉత్తీర్ణత సాధించి 74 శాతం పొందినట్లు ప్రిన్సిపాల్ నళిని తెలిపారు. పాఠశాల టాపర్ గా కె.విజయ లక్ష్మి (ఎం.పి.సి.)934 మార్కులు , ఎస్.భరత్ (బై.పి.సి)892 మార్కులతో, డి.సాయిరాం(సి.ఇ.సి) 871 మార్కులు పొందారు. మొదటి సంవత్సరం 73 మంది పరీక్ష వ్రాయగా 37 మంది ఉత్తీం ణత పొంది 51శాతం సాధించారు.జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో మొదటి స్థానం సమీరిన్ 838మార్కులు, అయేషా 816 మార్కు లతో ద్వితీయ స్థానం,ముషారా 800మార్కులతో తృతీయ స్థానం పొందినట్లు ప్రిన్సిపాల్ రమణ తెలిపారు. కస్తూరీ భా బాలికల పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం లో బై.పి.సి నందు 82 పరీక్షలు వ్రాసారు. అఖిల అనే విద్యార్థిని 352 మార్కులతో మొదటి స్థానం పొందినట్లు ఎస్.ఓ.మధు సూధనాదేవి చెప్పారు. ఉయ్యాలవాడ : ఈ ఏడాది మార్చిలో జరిగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో స్థానిక మోడల్ స్కూల్‌లో 70శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సి పల్ నూర్జహాన్ గురువారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ స్కూల్లో 43మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా అందులో 30 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీలో సుస్మిత అనే విద్యార్థినికి 896 మార్కులు, బైపీసీ లో నూర్జహాన్ 843 మార్కులు, సీఈసీలో వైష్ణవి 790 మార్కులు సాధించా న్నారు.పుచ్చకాయలపల్లి కస్తూరి బా బాలికల పాఠశాలలో ద్వితీయ సంవత్సరం 29కి 16 మంది, మొదటి సంవత్సరం 27మందికి 13మంది బాలికలు ఉత్తీర్ణత సాధించినట్లు ఎస్ఓ అంజనమ్మ తెలిపారు.

శిరివెళ్ల : మండల పరిధిలోని యర్రగుంట్ల జి టి ఎం అర్ జూనియర్ కళాశాల, శిరివెళ్లలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యా వసతి గృహం, మరియు ఏపీ మోడల్ జూనియర్ కళాశాల విద్యార్తులు నేటి విద్యాసంస్థల ఇంటర్ పబ్లిక్ పరీక్షలు రాయగా బాలికలదే పై చేయిగా ఫలితాలు వెలువడ్డాయి. శిరివెళ్ల కేజీబీవీలో 44%, ఏపీ మోడల్ జూనియర్ కళాశాలలో 43,5% యర్రగుంట్ల జిటిఎంఆర్ జూనియర్ కళాశాల లో 40% మంది విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో పాస్ అయినట్లు జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ జ్యోతి, ఇశ్రాత్ బేగం, శ్రీనివాసులు, తెలియజేశారు.

ఆళ్లగడ్డ : ఇంటర్ ఫలితాలలో పట్టణానికి చెందిన ప్రజ్ఞ జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారు.. ప్రతిభ కనబరిచిన ప్రజ్ఞ కళాశాల విద్యార్థులను రోటరీ గవర్నర్ సతీష్ బాబు, సీనియర్ రొటేరియన్ బాగ్ సింగ్ పాను గురువారం స్థానిక రోటరీ భవనంలో అభినందించారు. సీనియర్ ఎంపీసీ విద్యార్థులైన ప్రియాంక (980/1000) మరియు శ్రీజ (973/1000), జూనియర్ కాలేజి విద్యార్థులైన భార్గవ రెడ్డి (462/470), సోనియా(456/470)జూనియర్ సీఈసీ విద్యార్థులైన ప్రవల్లిక (482/500) సాయి కిషోర్ (478/500)లను జ్ఞాపికలతో అభినందించారు. రోటరీ క్లబ్ సభ్యులు మరియు ప్రజ్ఞ యాజమాన్యం ప్రజ్ఞ నరసింహారెడ్డి, హేమలత రెడ్డి పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల : ఇంటర్మీడియట్ ప్రథమ,ద్వితీయ సంవత్సర పరీక్ష ఫలితాలను ప్రభుత్వం బుధవారం రాత్రి విడుదల చేసింది. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల లో సెకండ్ ఇయర్‌లో 65 మంది పరీక్షలు రాయగ 35 మంది పాసై 53% శాతం ఉత్తీర్ణత సాధించగా, ఫస్ట్ ఇయర్ నందు 29 మంది పరీక్షలు రాయగా 17 మంది పాసై 59 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ బి శ్రీనివాసులు తెలిపారు. సీనియర్ ఇంటర్ నందు బి మౌనిక బైపీసీలో 1000కి 885 మార్కులు సాధించి కాలేజీలోప్రథమ స్థానంలో నిలిచిం దని, జూనియర్ ఇంటర్లో 59 శాతం ఉత్తీర్ణత సాధించి ఉమ్మడి కర్నూల ు జిల్లాలో ప్రథమ స్థానంలో కళాశాల నిలిచిందని తెలిపారు. మోడల్ స్కూల్ నందు సెకండ్ ఇయర్లో 42 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాక 20 మంది పాసయి 48శాతం ఉత్తీర్ణత సాధించారని, ఫస్ట్ ఇయర్‌లో 47మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 19 మంది పాసై 41 శాతం ఉత్తీర్ణత సాధించి నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పి.చంద్రసేనారెడ్డి తెలిపారు. సీనియర్ ఇంట ర్లో ఎంపీసీలో జి.రూప పావని 1000 మార్కులకు గాను 890 మార్కు లు సాధించి మోడల్ స్కూల్ నందు ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఫస్ట్ ఇయర్ విద్యార్థినిలు 8 మంది పరీక్షలు రాయగా ఎవరు ఉత్తీర్ణులు కాలేదు. కేజీబీవీ నందు 2022 -23 విద్యా సంవత్సరంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ను ప్రారంభించారు.

ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చాటిన కేజీఆర్ కళాశాల

బనగానపల్లి : ఇంటర్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్టు కేజీఆర్ కళాశాల కరస్పాండెంట్ రామచంద్రారెడ్డి ప్రిన్సిపాల్ టీవీఎస్ మూర్తి తెలిపారు. సెకండ్ ఇయర్ నందు ఇంగ్లీష్ మీడియం శ్రీ హర్షిత 2 ఎంపీసీ 988/1000 బనగానపల్లె, బి చంద్రిక బైపీసీ 979/1000 మీరాపురం, ఎం లిఖిత సీఈసీ 905/1000 కొత్తపేట, బి వంశీ సిఇసి 850/1000 పలు కూరు, జూనియర్ ఇంటర్ ఇంగ్లీష్ మీడియం నందు పి సన ఎంపీసీ 391/470 బనగానపల్లె, యస్ నవ్య బైపీసీ 414/440 మిట్టపల్లి, యస్ లలిత సీఈసీ 395/500 ఎనకండ్ల, ఎం శిరీష సీఈసీ 395/500 ఎనకండ్ల ఉత్తమ ఫలితాలు సాధించినందుకు అభినందించారు.

ప్రవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి



విశాలాంధ్ర - డోన్ : ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా అడ్మిషన్లు నిర్వహిస్తున్న ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు యు రంగరత్నం, డోన్ మండల అధ్యక్షుడు కె.సిద్ధార్థ,ఆర్గనైజింగ్ కార్యదర్శి జి. మనోజ్ విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేశారు. గురువారం స్థానిక నక్కి రామన్న భవన్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డోన్ మండలంలోని ప్రైవేట్ విద్యా సంస్థలు ప్రభుత్వ నిబంధన లను తుంగలో తొక్కి ఇస్తానుసారంగా మనకు ఎవరు అడ్డు అనే విధంగా అక్రమ అడ్మిషన్ నిర్వహిస్తున్నారన్నారు.ఇప్పటికైనా ప్రైవేట్ విద్యా సంస్థలు చేస్తున్న అక్రమ అడ్మిషన్లను ఆపాలని లేకపోతే ఉప విద్యాశాఖ అధికారి కార్యాలయం ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు ధనుష్, రాము, వీర శేఖర్,మనోజ్ పాల్గొన్నారు.

సాగునీటి సాధన పోరాటంలో ముందుంటాం

విశాలాంధ్ర - జూపాడు బంగ్లా : మండ్లెం గ్రామ రైతులు చేస్తున్న సాగునీటి సాధన పోరాటంలో సీపీఐ ముందుంటుందని జిల్లా కార్యవర్గ సభ్యులు వి.రఘురాంమూర్తి,నాయకులు రమేష్ బాబులు పిలుపునిచ్చా రు. గురువారం మండ్లెం గ్రామంలో రెండోరోజు జరుగుతున్న జలదీక్ష కార్యక్రమంలో వారు పాల్గొని మద్దతు తెలిపారు.అనంతరం తర్తూరు గ్రామానికి విచ్చేసిన జాయింట్ కలెక్టర్ కి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీశైలం నీటి మునక బాధితులకు అన్యాయం జరుగుతుందని,శ్రీశైలం ప్రాజెక్టుకు త్యాగం చేసిన ఈ గ్రామ రైతాంగానికి సాగునీరు అందించకపోవడం పాలకుల సిగ్గుచేటు విషయ మన్నారు.ఈ ప్రాంతానికి నీటి సదుపాయం కల్పించాలని, పాలకులు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు ప్రశ్నించారు.సాగునీటి పై కనీస అవగాహన కూడా పాలకులకు లేదన్నారు. నాగటూరు లిఫ్ట్ ద్వారా, కేసీ కెనాల్ ద్వారా జూపాడు బంగ్లా ఫేస్ వన్ ద్వారా కూడా ఈ ప్రాంతానికి నీటి సదుపాయం కల్పించవచ్చన్నారు. జలదీక్ష ప్రారంభం మాత్రమేనని మెట్ట పొలాలకు నీరు సాధించేంత వరకు ఈ పోరాటం కొనసాగిస్తామని వారు హెచ్చరించారు. గ్రామ రైతు సంఘం నాయకులు సురేష్, స్వామి దాసు,అరుణ్ కుమార్, రవికుమార్ పాల్గొన్నారు.

బాధ్యతయుతంగా పెంచాలి



విశాలాంధ్ర - డోన్ : పిల్లలను తల్లిదండ్రులు బాధ్యతయుతంగా పెంచాలని డోన్ ఫారెస్ట్ బీట్ అఫీసర్ భారతి అన్నారు. బుధవారం రాత్రి డోన్ పట్టణంలో నారాయణ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే ఈ కిడ్స్ పిల్లలకు ఏజీఎం రమేష్ కుమార్ ఆదేశాల మేరకు చిన్నారుల ఆటపాటలతో అంగరంగ వైభవంగా ప్రిన్సిపల్ నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ భారతి,ఆర్ఐ దుర్గలక్ష్మి మేడం,హైస్కూల్ కోఆర్డినేటర్ భాగ్యలక్ష్మి, జోనల్ కోఆర్డినేటర్ గుంటూరు అరుణ పాల్గొన్నారు.ఈ సందర్భంగా భారతి మాట్లాడుతూ చిన్నపిల్లలను ఉద్దేశించి మొట్టమొదటి గురువు తల్లి అని గుర్తు చేస్తూ పిల్లలని నైతిక విలువలువలతో బాధ్యతాయుతంగా పెంచాలన్నారు. సాఫ్ట్ స్కిల్స్ డిపార్ట్మెంట్ నాగరాజు,ఏ ఓ మోహన్ గౌడ్, సుమిత్ర, సురేఖ,విమల పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలి

విశాలాంధ్ర - చాగలమర్రి : యువత,నిరుద్యోగులు స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలని వైసీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి బాబులాల్,వైసిపి మండల కన్వీనర్ కుమార్ రెడ్డి లు పిలుపు నిచ్చారు. గురువారం చాగలమర్రి పట్టణానికి చెందిన ముల్లా ఇబ్రహీం ఆర్అండ్‌బి బంగ్లా వద్ద ఏర్పాటు చేసిన మి ఆర్ట్స్, స్ప్రే పెయింట్ వర్క్,స్టిక్కరింగ్ దుకాణాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ యువకులు ఉద్యో గాల కోసం నిరీక్షిస్తూ సమయాన్ని వృథా చేసుకోకుండా స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలన్నారు. ఉపాధి పొందడంతో పాటు మరో నలుగు రికి జీవనోపాధి కల్పించిన వారవుతారన్నారు.ఉప సర్పంచ్ సోహెల్,వై స్ ఎంపీపీ, రఫి,వైసీపీ నాయకులు ముల్లా ఖాదర్ భాష,ఖాజారసూల్, అబ్దుల్లా,బబ్లూ,ప్రకాష్,ప్రచార కార్యదర్శి పెయింటర్ రఫీ పాల్గొన్నారు.

ప్రేమ విషయం పై ఘర్షణ

విశాలాంధ్ర - వెలుగోడు : వెలుగోడు పట్టణం లోని బాషా నగర్ ప్రేమ విషయం పై ఘర్షణ పడి కొడవలి తో దాడి చేయగా , ఒక మహిళ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం శివుడు కుమారుడు వారి బంధువు అయిన వెంకట లక్ష్మమ్మ కూతురు ను ప్రేమించాడు. ఆ ప్రేమ ఇష్టం లేని శివుడు వెంకటలక్ష్మమ్మ మీద గురువారం ఘర్షణ పడి , దాడి చేశారు. వెంకటలక్ష్మమ్మ ను కొడవలితో తలపైన కొట్టగా , తీవ్ర రక్త గాయం అయింది.వెంటనే వెలుగోడు ప్రభుత్వ హాస్పిటల్ కి తీసుకొని వెళ్లగా ప్రథమ చికిత్స చేసి , మెరుగైన చికిత్స కోసం నంద్యాలకి పంపడం జరిగింది.కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ జగన్ మోహన్ తెలిపారు.

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 28, ఏప్రిల్ 2023

వేసవిలో కూడా పనులు కల్పించకపోతే ఎలా?

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : జిల్లాలో 12 మండలాల్లో నిర్దేశించిన లక్ష్యంలో 50శాతం కంటే తక్కువ పనులు కల్పించారని, జిల్లా కలెక్టర్ డా.జి.సృజన తీవ్ర అసంతృప్తి ని వ్యక్తం చేశారు. వెనుకబడిన కర్నూలు జిల్లాలో వేసవికాలంలో కూడా పనులు కల్పి ంచక పోతే ఎలా? అంటూ అధికారులను ప్రశ్నిం చారు.గురువారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పంచాయతీ రాజ్, డ్వామా, ఆర్డబ్ల్యూఎస్, డిఆర్డిఎ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించార్ను, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 110,120 శాతం చేయాల్సింది పోయి నిర్దేశించిన లక్ష్యాలు కూడా సాధించలేదని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం టార్గెట్ తక్కువగా ఇచ్చినప్పటికీ కూడా లక్ష్యాన్ని సాధించలేక పోయారన్నారు. ముఖ్యంగా 50 శాతం కంటే తక్కువగా 12 మండలాలు ఉన్నాయని, అందులో హాలహర్వి 24 శాతం, నందవరం 35.89 శాతం, చిప్పగిరి 37.17 శాతం మాత్రమే పనులు కల్పించారని, ఎందుకు పనులు కల్పించడం లేదని సంబంధిత ఏపీడీలను ప్రశ్నించారు. వెల్దుర్తి, పత్తికొండ తదితర మండలాల్లో చేయగా లేనిది మీరెందుకు చేయలేరని కలెక్టర్ అధికారులను నిలదీశారు. ఏవేవో కారణాలు చెప్పకండని, లక్ష్యం మేరకు పనులు కల్పించక పోతే ఏపీడీలు, ఎంపీడీఓ లపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. అలాగే ఎన్ఎమ్ఎంఎస్ యాప్‌లో లేబర్ అటెండెన్స్‌కి సంబంధించి వెల్దుర్తి, ఎమ్మిగనూరు,సి.బెలగల్ మండలాల్లో 70 శాతంలోపే ఉండడంతో వచ్చే వారం లోపు 95 శాతం కంటే తక్కువ అటెండెన్స్ నమోదు అయితే సంబంధిత ఎంపీడీవోలు, ఏపిడిలకు వేతనాలు నిలుపుదల చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. ఎస్సీ ఎస్టీ లకు జాబ్ కార్డుల జారీలో కూడా కొన్ని మండలాలు వెనుకబడి ఉండటంపై కలెక్టర్ సంబంధిత ఏపీడిలపై అసహనం వ్యక్తం చేశారు. పంచాయతీ రాజ్, డ్వామా, డి ఆర్ డి ఎ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాహిత్యంలో కొత్త ఒరవడి సృష్టించిన శ్రీ శ్రీ

విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల : సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో శ్రీశ్రీ జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు "శ్రీశ్రీ సాహిత్యం - సమాజంపై ప్రభావం" అనే అంశం పైన వ్యాసరచన పోటీలను సిల్వర్ జూబ్లీ కళాశాలలో వ్యాసరచన పోటీలను నిర్వహించారు. శ్రీ శ్రీ చిత్రపటానికి సిల్వర్ జూబ్లీ కళాశాల తెలుగు అధ్యాపకులు ఇందిరమ్మ, ఫాతిమాబి, వెంకటలక్ష్మి,సెయింట్ జోసఫ్ డిగ్రీ మహిళ కళాశాల తెలుగు అద్యాపకురాలు ఇందిరమ్మలు పూలమాలలు వేసారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సుందరయ్య స్ఫూర్తి కేంద్రం నాయకులు జి.మధు, శ్రీ శ్రీ జయంతి ఉత్సవ నిర్వాహకులు ప్రమోద్ చక్రవర్తి, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సాయి మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో శ్రీశ్రీ ఒకొత్త ఒరవడిని సృష్టించారని అన్నారు. ప్రజల జీవిత వృత్తాంతంగా తన కవితలను, కథలను, గేయాలను ప్రజలకు అందించిన గొప్ప కవి అని వారు కొనియాడారు. శ్రీశ్రీ కవితలను నేటి యువత తప్పక చదివి వాటి ద్వారా స్ఫూర్తి పొందాలని పిలుపునిచ్చారు . సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ద్వారా సేవా కార్యక్రమాలను ప్రజలకు అందిస్తుందని ,మహకవి శ్రీశ్రీ జయంతి సందర్భంగా ఆటలు, పాటలు ,వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సర్కిల్ స్టేషన్ తనిఖీ

విశాలాంధ్ర - కోడుమూరు : నియోజకవర్గ కేంద్రమైన కోడుమూరు సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో కర్నూలు రేంజ్ డిఐజి సెంథిల్ కుమార్ రికార్డుల తనిఖీలు నిర్వహించారు. గురువారం ఉదయం ఆయన జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌తో కలిసి జిల్లాలోని ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని గోనెగండ్ల పోలీస్ స్టేషన్ తనిఖీ చేసి మార్గమధ్యంలో కోడుమూరు సర్కిల్ కార్యాలయానికి చేరుకున్నారు. కోడుమూరు సర్కిల్ కార్యాలయానికి చేరుకున్న డిఐజీ,ఎస్పిలకు కర్నూల్ డిఎస్పి కేవీ మహేష్,సీఐ వి శ్రీధర్ తోపాటు కోడుమూరు,సి.బెళగల్, గూడూరు ఎస్సైలు ఏపీ శ్రీనివాసులు, పీరయ్య, నరేంద్రలు పుష్పగుచ్చాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బంది నిర్వహించిన షో గార్డ్ వందనం స్వీకరించిన డిఐజి సెంథిల్ కుమార్ సర్కిల్ కార్యాలయంలోని పలు కేసుల రికార్డులను పరిశీలించారు. అలాగే మహిళా పోలీసులతో డిఐజి మాట్లాడుతూ వారికి ఉద్యోగ బాధ్యత,విధులపై పలు సలహాలు,సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఐలు దుర్గాదేవి,సురేంద్ర,హెడ్ కానిస్టేబుల్ ఈరన్న,ఎస్ఎం భాషా,లోకేష్, సుదర్శన్,పోలీస్ సిబ్బంది మహబూబ్ బాషా,నాగరాజు, రమేష్ బాబు,దేవప్రసాద్,ఐడబ్ల్యూ రమేష్, హెూంగార్డులు సాగర్,హిరావలి తదితరులున్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

విశాలాంధ్ర - గోనెగండ్ల : అకాల వర్షాలకు మిరప పంట దెబ్బతిన్న రైతులకు ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం అధ్యక్షుడు పి.రామచంద్రయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.జగన్నాథం లు అన్నారు. కర్నూలు జిల్లా గోనెగండ్ల మండల పరిధిలోని అలువాల, కులుమాల గ్రామాలోల్లో సీపీఐ, రైతు సంఘం నాయకులు పర్యటించారు.అందులో భాగంగా ఆయా గ్రామాల రైతులు మల్లేష్, నరసింహుడు,సుంకన్న ల రైతుల మెరప పంట పొలాలను పరిశీలించారు.బుధవారం తెల్లవారుజామున అకాల వర్షానికి,మెరప పంట నీటిలో కొట్టుకొనిపోయి.దాదాపు రైతు 2లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టారని రైతులు సీపీఐ నాయకుల ఎదుట వాపోయారు.ఈ సందర్భంగా రామచంద్రయ్య, కె.జగన్నాథంలు మాట్లాడుతూ ఆకాల వర్షంకు మిర్చి పంట నీటిలో తడిసిపోయి. రైతులకు టార్పాలు ఇవ్వాలన్నారు. అయితే ఇంతా జరిగిన తహశీల్దార్, వ్యవసాయ శాఖ అధికారులు కూడా ఇంతా వరకు పరిశీలించకపోవడం దారుణమని మండిపడ్డారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంపన్న గౌడ్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సత్యన్న, సీపీఐ మండల కార్యదర్శి నాగప్ప, ఏఐటీ యూసీ తాలుకా కార్యదర్శి బాలరాజు, గోపాల్, వీరేష్, అహ్మద్,సి నాగేష్, రామలింగు,ముసలయ్య, నరసింహుడు,కాజ, హనుమంతు, దుబ్బన్న, వెంకటేష్, ఈరన్న, జయరాముడు, శీను వాసులు, పాల్గొన్నారు.

ఆరిన పంటలను రైతులు ఇంటికి తెచ్చుకోవాలి

విశాలాంధ్ర - పెద్దకడబూరు : పొలాలలో ఉన్న అరిన పంటలను రైతులు ఇంటికి తెచ్చుకోవాలని మండల వ్యవసాయ అధికారి వరప్రసాద్ అన్నారు. గురువారం రైతులు కల్లాలలో తడిసిన మిరప పంటను మండల వ్యవసాయ అధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారం రోజుల పాటు వాతావరణం మేఘావృతమై ఉంటుందని తెలిపారు. ఆరిన పంటలను ఇంటి వద్దకు తెచ్చుకోవాలని, ఆరని పంటలు ఉంటే తార్పలీన్లు సిద్ధంగా ఉంచుకొని పంటలను కాపాడుకోవాలని సూచించారు. వరి ధాన్యం తడచినట్లైతే మొలకలు రాకుండా అవసరమైతే లీటరు నీటికి 5 గ్రాములు కలిపిన ఉప్పు ద్రావణం చల్లుకోవాలని సూచించారు. ఈయన వెంట వ్యవసాయ సహాయకులు ఇందు, శ్వేత ఉన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

విశాలాంధ్ర - వెల్దుర్తి : స్థానిక పోలీస్ స్టేషన్‌కు గురువారం ఉదయం కర్ణాటక మద్యం తరలిస్తున్నారని సమాచారం రావడంతో ఎస్సై చంద్రశేఖర్ రెడ్డి తన సిబ్బందితో నరసాపురం గ్రామం సర్పరాజుపురం మధ్యలో ముగ్గురు వ్యక్తులు దగ్గర 17 బాక్సుల 90 ఎం.ఎల్ డబ్బాలను బాక్సులు తీసుకోవడం జరిగింది. ఈ ముగ్గురు సిలబండ గ్రామానికి చెందిన గిడ్డయ్య రామగిడ్డయ్య మద్దిలేటి వీరితోపాటు వీరికి సహకరించిన వారు ఇంకో వ్యక్తి ఉన్నారని అరెస్టు చేయాల్సి ఉందని ఈ కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఇంకొన్ని సీల్ చేయాల్సి ఇంకో కొంతమందిని అరెస్టు చేయాలని ఎస్ఐ తెలిపారు.

మతోన్మాద బీజేపీని సాగనంపుదాం...దేశాన్ని కాపాడుకుందాం

విశాలాంధ్ర - ఆలూరు : దేశంలో మతోన్మాదాన్ని పెంచుతూ మనువాద భావజాలాన్ని పాఠ్యపుస్తకాల్లో చేర్చుతున్న నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిందేనని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణలు పేర్కొన్నారు. కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోడీ చేపట్టిన ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ గురువారం పట్టణ కేంద్రంలో సీపీఐ, సిపిఎంల ఆధ్వర్యంలో ప్రచారభేరీ యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ప్రతీ పౌరుడు గొంతెత్తి కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను నిలదీయాలన్నారు. ప్రజావ్యతిరేక నిరంకుశ మతోన్మాద బీజేపీని ఇంటికి సాగనంపి దేశాన్ని కాపాడుకుందామని, అలాగే నవ్యాంధ్రాకు రైల్వే జోన్, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకెజ్ వంటి హామీలను నెరవేర్చడంలో బిజెపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. పాలక ప్రభుత్వాలు పేదలకు, సామాన్య ప్రజలకు అండగా ఉండాల్సి పోయి వారి మీద మోయలేనంత భారాలను మోపుతోందన్నారు. 5 సార్లు కరెంట్ బిల్లులు పెంచడంతో కరెంటు బిల్లులు ముట్టుకుంటేనే షాకులు కొడుతున్నాయని, పెరిగిపోతున్న పెట్రోల్, డీజిల్ ధరలు మన బతుకుల్లో మంటలు రాజేస్తున్నాయని,3 సార్లు బస్సు టికెట్ చార్జీలనులను కూడా పెంచారని విమర్శించారు. సీపీఐ జిల్లా సమితి సభ్యులు భూపేష్, మండల కార్యదర్శి రామాంజనేయులు, సిపిఎం మండల కార్యదర్శి నారాయణస్వామి, సీపీఐ నాయకులు సిద్దు,భాషా, డివైఎఫ్ఐ నాయకులు మైన, గోవర్ధన్ పాల్గొన్నారు.

కర్నూలు వైద్యశాల : కర్నూల్ సీపీఎం, సీపీఐల ఆధ్వర్యంలో ప్రచార బేరి కార్యక్రమం మండి బజార్ నుండి కడప్పుర, బనగానపల్లి హెూటల్, మాసం బాషా దర్గా, రంగరాజు వీది, బేకర్ కట్టా వరకు ప్రచార కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి అబ్దుల్ దేశాయ్ అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్,సిపిఎం పార్టీ ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం రాజశేఖర్, సీపీఎం జిల్లా నాయకులు గురుసేఖర్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులు, దళిత క్రైస్తవులు, ముస్లిం మైనార్టీ లపైన బిజెపిదాని అనుబంధ సంఘాలైన సంఘ్ పరివార్, ఆర్ఎస్ఎస్, బజరంగ్ దళ్ కార్యకర్తల దాడులు పెరిగాయని గుర్తు చేశారు.సిపిఎం పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం విజయ్ షరీఫ్,కే.రామకృష్ణ నారా కమిటీ సభ్యులు మా భాష తదితరులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు : మోడీ ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న దుర్మార్గాలను ఎండగడదామని సీపీఐ మండల కార్యదర్శి వీరేష్, సిపిఎం మండల కార్యదర్శి తిక్కన్న అన్నారు. గురువారం మండల పరిధిలోని హెచ్ మురవణి, దొడ్డిమేకల గ్రామాల్లో సీపీఐ, సిపిఎం ఆధ్వర్యంలో మతోన్మాద మోడీ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రచార భేరి కార్యక్రమం నిర్వహించారు.నాయకులు అయ్యప్ప, నాగేంద్ర, అయ్యన్న,మునెప్ప,రమేష్,శీను,ఈరన్న,ఆంజనేయ, నరసప్ప,వెంకోబ పాల్గొన్నారు.

దేవనకొండ రూరల్ : కేంద్ర ప్రభుత్వం నిరంకుశ చర్యలు నిరసిస్తూ ప్రజలకు వ్యతిరేకంగా కార్పరేట్ శక్తులకు, ఆనుకూలంగా ఉన్న కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఈనెల 14 నుండి జరిగిన ప్రచార భేరి ముగింపు నేపథ్యంలో దేవనకొండ మండల కేంద్రంలో ఈనెల 29వ తేదీన సాయంత్రం నాలుగు గంటలకు ముగింపు సభ ఉంటుందని సభను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యులు బి.వీరాశేఖర్, సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి ఎమ్.నరసరావులు తెలిపారు. ఈ సభకు అన్ని గ్రామాల నుంచి అన్ని ప్రజాసంఘాల నుండి ఎక్కువ సంఖ్యలో హాజరై విజయ వంతం చేయాలని కోరారు. వామపక్ష పార్టీల నాయకులు నెట్టేకల్, వెంకటేశ్వర్లు, మాధవకృష్ణ, రవి, సుల్తాన్, కోదండ, కిరణ్, మస్తాన్, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శులు బాధ్యతాయుతంగా పర్యవేక్షించాలి

విశాలాంధ్ర - సి.బెళగల్ : పంచాయతీ కార్యదర్శులు అలసత్వం వహించకుండా బాధ్యతాయుతంగా పర్యవేక్షణ చేయాలని మండల అభివృద్ధి అధికారి ఏసీ రాముడు అన్నారు. గురువారం మండల పరిధిలోని సంఘాల గ్రామంలోని సచివాల యాన్ని ఎంపీడీవో స్పందన జరుగు సమయంలో అనగా మూడు నుంచి ఐదు గంటల మధ్యలో ఆయన సచివాలయాన్ని సందర్శించారు. ఎంపీడీవో సచివాలయాన్ని సందర్శించిన స్పందన సమయంలో వీఆర్వో మరియు డిజిటల్ అసిస్టెంట్ అలాగే ఎనర్జీ అసిస్టెంట్ గైర్హాజరు అయ్యారు. సచివాలయంలో స్పందన రిజిస్టర్ నిర్వహణ మీద సిబ్బంది కదలికల రిజిస్టర్ పైన అవగాహన కల్పిస్తూ సచివాలయ సిబ్బందికి సూచనలు చేయడం జరిగింది. సచివాలయం పరిధిలో సచివాలయంలో పనిచేసే ప్రతి ఉద్యోగి సమయపాలన పాటించి ప్రజలందరికీ కూడా సేవలు అందుబాటులో ఉంచాలని ఆయన వారిని ఆదేశించారు. ఎంపీడీవోతో పాటు ఆ గ్రామ సర్పంచ్ హనుమంతు ,సచివాలయ సిబ్బంది మరియు పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర - కృష్ణగిరి : ప్రజా శ్రేయస్సు వైసీపీ ప్రభుత్వ ధ్యేయమని పత్తికొండ ఎమ్మెల్యే శ్రీ కంగాటి శ్రీదేవి అన్నారు. గురువారం మండల పరిధిలోని పెనుమాల గూడెంపాడు గ్రామాల్లో గడపగడప మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా కంబాల పాడు గ్రామపంచాయతీ అయిన పెనుమాడ, గూడెంపాడు గ్రామాలలో సాయంకాలం ఇంటింటికి వెళ్లి జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ ఫలాలకు అర్హులు ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకోవాలని ఆమె వారిని కోరారు. రాష్ట్ర వైఎస్ఆర్సిపి కార్యదర్శి కంగాటి ప్రదీప్ కుమార్ రెడ్డి, మండల అధ్యక్షులు వెంకటరామిరెడ్డి, జడ్పిటిసి కే ఈ సుభాషిని, క్రిష్ణగిరి సొసైటీ అధ్యక్షులు బ్రహ్మానందరెడ్డి, మార్కెట్ వైస్‌చైర్మన్ మాధవరావు, ఈశ్వర య్య, శ్రీనాథ్ రెడ్డి ,మాధులు, రాజేందర్ రెడ్డి, కృష్ణమూర్తి, మండలఅధికారులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు

విశాలాంధ్ర వెల్దుర్తి రూరల్ : అణగారిన వర్గాల అభ్యున్నతి. రాష్ట్రంలో అడుగడుగునా వేళ్లూనుకుని పోయి ఉన్న అంటరానితనం రూపుమాపడమే సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని, తనని ఎంచుకుని మరీ ఆ లక్ష్యం సాధించే దిశగా ప్రోత్సహించి ఎస్సీ కమీషన్ ఛైర్మన్ పదవి ఇచ్చాడని ఎస్సీ కమీషన్ రాష్ట్ర ఛైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. అందులో భాగంగా తన జాతి వారికి ఏ సమస్య వచ్చినా తాను ముందుంటానన్నారు. గురువారం మండలం బోయనపల్లెలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణను ఆయన పత్తికొండ, కోడుమూరు ఎమ్మెల్యేలు కంగాటి శ్రీదేవి, డాక్టర్ సుధాకర్, మాదిగ కార్పొరేషన్ ఏపీ ఛైర్మన్ కొమ్మూరి కనకరావ్తో కలిసి చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయనతోపాటు అతిథులు మాట్లాడారు. అంబేద్కర్ జీవిత విషయాలపై అవగాహన కల్పించారు. ఐక్య రాజ్యసమితి అంబేద్కర్ పుట్టిన రోజున ప్రపంచ నాలెడ్జ్ దినంగా ప్రకటి ంచడం ఆయన మేధస్సుకిచ్చిన గౌరవమన్నారు.

విగ్రహ దాత: నర్సింగ్ ప్రభాకర్ రెడ్డి, వైసిపి గ్రామ నాయకులు నర్సింగ్ అశోక్ కుమార్ రెడ్డి,ఎస్సీ కార్పోరేషన్ జిల్లా, ఈడీ శ్రీనివాసకుమార్, తహసీల్దార్ రాజేశ్వరి, ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వం'రావుమాదిగ, మాల యువత అధ్యక్షుడు యాట ఓబులేసు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు. ఏపీ దళితసమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ముపాలెం శ్రీనివాసులు, ఎస్సీ కార్పోరే షన్ జిల్లా ఈడీ శ్రీనివాస కుమార్.ఏపీఎమ్మార్పీఎస్ నవీన్మాదిగ, జెడ్పీటీసీ సుంకన్న, వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సమీర్ కుమార్ రెడ్డి,, ఎస్సీ, ఎస్టీ విజిలెన్ కమిటీ సభ్యు డు ఎరుకలి రాజు, వైఎస్సార్సీపీ నాయకులు శరభారెడ్డి, పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా అభివృద్ధి

విశాలాంధ్ర - బ్యూరో కర్నూలు : పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడే యునాని వైద్యశాలను రాజకీయాలతో సంబంధం లేకుండా అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి టిజి భరత్ అన్నారు. గురువారం నగరంలోని యునాని వైద్యశాలకు ఆయన రూ. 2.30 లక్షలు విలువ చేసే అత్యాధునికమైన 4 బెడ్స్, లేబర్ రూములో ప్రత్యేకమైన బెడ్‌ను విరాళంగా అందజేశారు. అనంతరం టిజి భరత్ మాట్లాడుతూ ఓల్డ్ సిటీ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడే ఈ ఆసుపత్రిని సందర్శించిన సమయంలోనే అత్యవరమైన ఈ పరికరాలు అందజేయాలని నిర్ణయించు కున్నట్లు చెప్పారు. హాస్పిటల్ యాజమాన్యం కోరిన విధంగానే విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సమయంలో అవసరమయ్యే డి.జి సెట్ ను కూడా వీలైనంత త్వరగా అందిస్తానని చెప్పారు. తాను ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఈ విరాళాలు ఇవ్వడం లేదని టిజి భరత్ స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగానే మా టీజీవీ సంస్థల తరుపున సేవ కార్యక్రమాలు చేస్తున్నట్లు భరత్ తెలిపారు. ప్రజల కోసమే కార్పోరేట్ స్థాయిలో ఉండే అత్యాధునికమైన బెడ్స్ అందించానన్నారు.హాస్పిటల్ యాజమాన్యం, ముస్లిం నేతలు శాలువా కప్పి టిజి భరత్ ను సన్మానించారు. టిడిపి మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి జహంగీర్ భాష, టిడిపి నేతలు ఇబ్రహీం, మన్సూర్ ఆలీఖాన్, అబ్బాస్, మెహబూబ్, ఊట్ల రమేష్, రవి, పాల్ రాజ్, రాజ్ కుమార్, విక్రమ్ సింగ్, మహిళా నాయకురాలు రాజ్యలక్ష్మి, మారుతీ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

పొంతన లేని విద్యార్థుల ఉత్తీర్ణశాతం

విశాలాంధ్ర -హెూళగుంద : కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో ఈ నెలలో రాసిన ప్రథమ ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తీర్ణశాతం చెప్పడానికి అధికారులు పొంతన లేని సమాధానాలు చెప్పారు .ప్రథమ సంవత్సరంలో ఇరవై మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా కేవలం 7మంది మాత్రమే ఉత్తీర్ణులైనట్లు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ రుక్సానాబేగం గురువారం తెలిపారు. అలాగే రెండో సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలు 12 మంది విద్యార్థులకు గాను ఎనిమిది మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. సరైన సమాచారం అందించకుండా తనకు బస్సు వచ్చిందంటూ ఫోన్ కట్ చేసి సమాధానం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారు .పాఠశాల సిబ్బందిని సంప్రదించగా ఇంగ్లీషు లెక్చరర్ మాట్లాడుతూ ఊరు నుండి ఇప్పుడే వచ్చాను.అంటూ ఇంటర్ రెండో సంవత్సరంలో పదిమంది ఉత్తీర్ణులైనట్లు తప్పుడు సమాచారాన్ని అందించారు తనకేమి తెలియదని అన్నారు. అన్నీ వసతులు కల్పించినప్పటికీ ఉత్తీర్ణశాతం తగ్గిపోయిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. ఉపాధ్యాయులు సక్రమంగా విద్యార్థులకు బోధించారా లేదా అనే అనుమానం కలుగుతుందని ప్రజలు వాపోయారు . కేవలం 20 మందిని ఉత్తీర్ణం చేయలేకపోతే కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి పాఠశాల ఏర్పాటు చేసిన ఫలితం లేదని ప్రజలు వాపోయారు. జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని కస్తూర్బా గాంధీ గురుకులపాఠశాలలో ఉత్తీర్ణశాతం పెరిగేలా చూడాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థినీల ప్రతిభ

విశాలాంధ్ర - కర్నూల్ సిటీ : ఇంటర్ ప్రథమ ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫలితాలలో శ్రీ చైతన్య కళాశాలల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారని విద్యాసంస్థల ఏజీఎం మురళీ కృష్ణ తెలిపారు. సీనియర్ ఎంపీసీ విభాగంలో కుందం సాహితి 1000మార్కులకుగాను 989,బైపీసీ విభాగంలో మందల మానస 989,జూనియర్ ఎంపీసీ విభాగంలో దాక్షాయిని 470 మార్కులకు గాను 466, జూనియర్ బైపీసీ విభాగంలో 440 మార్కులకు గాను 434 మార్కులతో కర్నూలు జిల్లాలో అత్యధిక మార్పులు సాధించిన జాబితాలో నిలిచారన్నారు.

ఇంటర్ ఫలితాలలో నారాయణ విజయకేతనం : ఇంటర్ ఫలితాల్లో నారాయణ

కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని విద్యాసంస్థల కోర్ డీన్ పి. లింగేశ్వర రెడ్డి పేర్కొన్నారు. స్థానిక గాయత్రి ఎస్టేట్లోని కళాశాలలో విద్యార్థులను గురువారం అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు.జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో కావ్య శ్రీ 470 మార్కులకు గాను 465, సుబ్బ మేఘన 465 మార్కులు సాధించి మరో మారు విజయకేతనం ఎగరవేశారని తెలిపారు. జూనియర్ ఇంటర్ బైపిసి విభాగంలో శ్వేతా రెడ్డి 440 మార్కులకు గాను 432, హాఫీఫా తయ్యబ 432, షేక్ సానియా అజ్ర 432 మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలిచారన్నారు.సీనియర్ ఎంపీసీ విభాగంలో జాహ్నవి 989, విజయ తేజస్విని 988, రానా సాదిక్ 9 88, సీనియర్ బైపిసీ విభాగంలో సాయి ప్రణతి 988, మానిష్ 987, షేక్ సమీనా సుల్తానా 986, రాఘవి 986 మార్కులు సాధించి సత్తా చాటుకున్నారన్నారు. ఈ విజయం పట్ల కళాశాలల కోర్ డీన్ లింగేశ్వరరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

వివేకానంద జూనియర్ కాలేజ్ విద్యార్థినీల ప్రతిభ

ఆదోని : ఇంటర్మీడియట్ ఫలితాల్లో పట్టణంలోని వివేకానంద జూనియర్ కాలేజ్ విద్యార్థినిలు తమ ప్రతిభను చాటుకున్నారు. సీనియర్ ఎంపీసీ ఇంగ్లీష్ మీడియం

లో షాహిన్ భాను 917/ 1000, సీనియర్ బైపీసీ ఇంగ్లీష్ మీడియంలో దీపిక 885/1000, జూనియర్ బైపీసీ ఇంగ్లీష్ మీడియంలో షేక్ రుక్సార్ భాను 419/440, జూనియర్ ఎంపీసీ ఇంగ్లీష్ మీడియంలో రుమానాభాను 407/470 మార్కులు సాధించి టౌన్ టాపర్గా నిలిచారని కళాశాల కరస్పాండెంట్ షేక్ పర్వీన్ భాను తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యార్థిని విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ పట్టణంలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న వివేకానంద జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచా రని, విద్యార్థులను ప్రతిభవంతులుగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం అని తెలిపారు.

కెవిఆర్ అమ్మాయిల జయకేతనం

కోడుమూరు : ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం ఫలితాలలో కోడుమూరు కెవిఆర్ కళాశాల విద్యార్థిని-విద్యార్థులలో అమ్మాయిలు తమదైన ప్రతిభ కనబరిచి సత్తా చాటారు.ఇంటర్ రెండవ సంవత్సరం ఎంపీసీ విభాగంలో కె.వర్షిత,బి మౌనికలు 971 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలవగా,రేవతి 961,ఎం లలిత 947 మార్కులు సాధించారు. రెండవ సంవత్సరం బైపిసి విభాగంలో 959 మార్కులు సాధించిన జి జయంతి కళాశాలలో ప్రథమ స్థానంలో నిలువగా,940-సి గాయత్రి,930-శే రవీనా,912-శెట్టి సుమన,906-బి అఖిలలు అత్యధిక మార్కుల సాధించి ప్రతిభ కనబరిచారు.అదేవిధంగా ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీలో కే పర్వీన్ 418,సీఈసీలో ఎస్ అఫ్రీన్ 457మార్కులు సాధించి జయకేతనం ఎగరవేశారు. అత్యధిక మార్కులు సాధించి కళాశాలకు వన్నెతెచ్చిన అమ్మాయిలను,వారికి బోధించిన అధ్యాపకులను కళాశాల ప్రిన్సిపాల్ గోట్ల శేఖర్,కరస్పాండెంట్ ఎం రవిబాబు,డైరెక్టర్ ఎస్ మస్తాన్‌లు అభినందించారు.

ఐకమత్యమే మహాబలం

విశాలాంధ్ర - ఆదోని రూరల్ : కుటుంబమైన సంఘమైన ఏ ఒక్క వ్యవస్థ అయినా ఐకమత్యంతో ఉన్నప్పుడే తమ యొక్క గొప్పతనాన్ని నిరూపించుకోవడం మహాబలంగా మలుచుకోవడం సాధ్యమవుతుందని జంగమ్మ సంక్షేమ సంఘం డివిజన్ కార్యదర్శి అల్కూరి మఠం మహర్షి విజయ్ కుమార్ తెలియజేశారు.గురువారం ఆయన విలేకరుల తో మాట్లాడుతూ కర్నూలు జిల్లా జంగమ సమాజ సేవా సంఘం కమిటీని ఏర్పాటు చేసుకునేందుకు ముందస్తుగా ఈనెల 30న ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల సమీపంలోని మల్లికార్జున విద్యాలయంలో ఉ,,గం,,10లకు గ్రామ, మండల,జిల్లా స్థాయి జంగమ కులస్తులతో సమావేశం ఏర్పాటు చేసుకొని తుది నిర్ణయానికి వచ్చి జిల్లా కమిటీని తీర్మానించుకోవడం జరుగుతుందని విజ్ఞప్తి చేశారు. ఆయనతోపాటు జంగమ సంక్షేమ సంఘం డివిజన్‌అధ్యక్షుడు గురునాథయ్యస్వామి ఉన్నారు.

ఉరుకుందలో వేలం పాటలు

విశాలాంధ్ర- కౌతాళం రూరల్ : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రమైన శ్రీ ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానంలో గురువారం వివిధ పనులకు గాను ఈవో మల్లికార్జున ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించారు. దేవస్థానం సంబం ధించి కరపత్రాలు, వాల్ పోస్టర్లు ప్రింటింగ్ కొరకు ఇద్దరు టెండర్లు వేయగా గురు బృందావన్ గ్రాఫిక్స్ పాటను దక్కించుకోగా, నిత్య అన్నదానమునకు వంట చెరకు సప్లై కొరకు ఇద్దరు టెండర్లు వేయగా రామాచారి పాటను దక్కించు కొన్నారు. దర్శనానికి వచ్చే భక్తుల సెల్ ఫోన్లు, లగేజీలు భద్రపరుచుటకు గాను వేలంపాటలు పాల్గొనగా లక్ష్మి పాటను దక్కించుకున్నారు. బట్టలు, మెటీరియల్ సప్లై కొరకు నలుగురు పాటలో పాల్గొన్నారు. స్వామివారికి పూలు, పూలదండలు కొరకు ముగ్గురు వేలం పాటలు పాల్గొనగా రాఘవేంద్ర పాటను దక్కించుకున్నారు.అగర్బత్తీలు, ఏర్పాటు కొరకు సోయా ప్రొటీన్ పాటను దక్కించుకున్నారు. దేవస్థానంలోని గోశాలకు వచ్చే భక్తులకు బెల్లం, గడ్డి, పళ్ళు సప్లై కొరకు ఇద్దరు పాటలు పాల్గొనగా వీరమ్మ పాటను దక్కించుకున్నారు. అలాగే దేవస్థాన భూములకు నరసన్న1.58 ఎకరాలకు 5200 రూపాయలు, రామన్న గౌడ్ 2.67 ఎకరాలకు23000 రూపా యలు, చాకలి హుసేని1.13 ఎకరాలకు3500 రూపాయలు చెల్లించి పాటను సొంతం చేసుకున్నారు. సూపర్డెంట్ వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్లు కిరణ్,కుమార్,సిబ్బందిలు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా ఉంటే ప్రయాణించేదెలా?

విశాలాంధ్ర -హెూళగుంద : మండలంలోని వందవాగాలి రోడ్డు అధ్వానంగా మారడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని ప్రజలు ఆరోపించారు.రోడ్డు మధ్యలో కల్వర్టు కూలిపోయి ప్రమాదంగా మారి మృతువుకు ఆహ్వానం పలుకుతున్న పట్టించుకునే నాథుడు కరువయ్యారని ప్రజలు వాపోయారు .రోడ్డు మధ్యలో కల్వర్టు గోడకూలిపోయి పెద్ద గుంత పడిందని ఎవరైనా గుంతలో పడితే ప్రమాదమే గతి అని ప్రజలు వాపోయారు.రోడ్డు విరువైపుల కంపచెట్లు ఏపుగా పెరిగి ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్న అధికారులు తొలగించడంలో నిర్లక్ష్యంగా ఉన్నారని విద్యార్థులు, యువకులు పేర్కొన్నారు. రాళ్లు లేచి వాహనాల రాకపోకలకు అడ్డంకిగా మారిందని వాహనాల యజమానులు పేర్కొన్నారు .ఇప్పటికైనా సంబంధిత జిల్లా ఉన్నత అధికారులు చర్యలు తీసుకుని రోడ్డు మరమ్మతు చెయ్యాలని ముళ్ళకంపలను తొలగించాలని రోడ్డు మధ్యలో దెబ్బ తిన్న కల్వర్టును వెంటనే మరమ్మత్తు చేయాలని ప్రజలు డిమాండ్ చేశారు.